# బీరకాయ పీచు

తెలివైన కుర్రవాళ్ళను చూస్తే సంతోషంగా వుంటుంది కాని, మనం ఆ వయసులో అలా వున్నామా అనే ఆలోచన వచ్చి అబ్బే అనిపిస్తుంది. ఇప్పటి కుర్రాళ్ళకీ, మనకీ, మన చిన్నతనాలకీ ఏవీ పోలికల్లేవు. చూస్తూంటే యీ ప్రపంచం మన కళ్ళముందే ఎలా మారిపోయిందీ ఆశ్చర్యంగా వుంటుంది.

టీ తెచ్చి బల్లమీదపెట్టి న్యూస్ పేపర్లని మేగజీన్లని యిటా అటూ జరిపి వెళ్ళిపోయింది మా ఆవిడ. నా కాలోచించడం ఎలాగో మావిడకి సర్దుడు అలాగ. రోజంతా చిమ్మెటలా సర్దుతూ వుంటుంది ఏవిటేవిటో ఆలోచిస్తూ. ఆలోచించడం అంటే యిందులో, యీ ప్రపంచంలో వుంటూ దేనికి చెందకుండా అంటీ ముట్టనట్లు వుండడం-ఇదీ ఓ రకం ఓల్డేజి చిహ్నమే-ప్రస్తుతాన్నుంచి పలాయనమే-బోరెత్తిస్తున్నానేమో....

ఇదిగో-సరిగ్గా యిలా రాతిబెంచీ మీద కూర్చుందామని లేవబోతూండగా మోటారుసైకిలు చప్పుడు వినిపించింది. ఓ కుర్రాడు ఎర్రగా చాకులా వున్నాడు- వాడికంటే వాడి చిరునవ్వు ముందు లోపలికొచ్చినట్లుగా వుంది. వెనక వీధిలోని వెంకటేశ్వరస్వామి గుళ్ళోకెళ్ళి ఐదు కొబ్బరికాయలుకొట్టి ప్రసాదంగా ఓ చెక్క మా యింట్లో యివ్వడానికొచ్చాడు. మా యింట్లో వాళ్ళక్క వుంది. అంటే ఆ చిరునవ్వులు చిందిస్తున్న కుర్రాడి పెద్దనాన్న కూతురే మా కోడలు. ఈ అమ్మాయి చిన్నప్పుడు ఆ కుర్రాడికి లెక్కలూ, ఫిజిక్సూ చెప్పిందట. నేను కొబ్బరిముక్కలు నవుల్తున్నాను. అక్కా తమ్ముడూ మాట్లాడేసుకుంటున్నారు.

గుళ్ళోకెళ్ళిన కుర్రాడు కుంకంతో నిలువుబొట్టు పెట్టాడు. తమ్ముడు సిగరెట్లు కాల్చడని చెప్పింది అక్క. అదంత గొప్ప విషయం కాదులే అనుకున్నా. సిగరెట్లు కాల్చని కుర్రాళ్ళు చాలా మంచివాళ్ళని అనుకోవడానికి నా మనస్సెందుకో అంగీకరించడంలేదు.

మా కోడలు చెప్పింది.

ఇన్‌స్టాల్‌మెంట్ల మీద నెలకి రెండొందలు కడితే లాటరీ తీస్తారట నెలనెలా. ఎవరికి లాటరీ వస్తే వారికి 'లూనా' కాని 'టి.వి.ఎస్' కాని యిచ్చేస్తారట. ఇహ మళ్ళీ వాళ్ళు ఏవీ కట్టనక్కర్లేదట. వాళ్ళ తమ్ముడికి మొదటి నెల మొదటి రెండువందలు కట్టగానే లాటరీలో మోటారుసైకి లొచ్చేసిందట.

'హ్హా' అని లేచివెళ్ళి కొత్తబండిని ఓ చుట్టుచుట్టిగుర్రాన్ని నిమిరినట్లు దాన్ని నిమిరి 'బలే ఛాన్స్-లక్కీ ఫెలోవోయ్ నువ్వు' అని తన్ని వీపు నిమరకుండా నిమిరినంత పన్జేసి వాడి అదృష్టం గురించి అసూయపడసాగేను.

అసూయపడటంలో మన దురదృష్టం గురించి మనకు వోదార్పు లభిస్తుందను )కుంటాను. ఇలాటి వాటిల్లో చూస్తూచూస్తూ 'నెలనెలా రెండొందలు కట్టాలంటే, కుర్రాడు కనక తెగించాడు. కాని మనకైతే అదంతా దండగనే అనిపిస్తుంది. లాటరీలో లాభాలు మనకు రావని రూఢిగా నిశ్చయంచేసుకున్న వాడ్ని. రెండు మూడుసార్లు లాటరీ టిక్కెట్లు కొన్నా-ఏవీ రాలే: కానీ, యిలా ఇన్‌స్టాల్‌మెంటు కట్టగానే మోటార్ సైకిల్ ఛాన్స్ కొట్టేసిన కుర్రాడ్ని చూడగానే నేను మరింత ముసలివాడ్నయినట్లు ఆరు నిలువుల అఖాతంలోకి పడిపోయినట్లు ఫీలయ్యాను.

మా కోడలు వాడి అదృష్టం గురించి మురిసిపోతూ చెప్పుకుపోతుంది.

రోజూ గుళ్ళో కెళ్తాడ్ట. వాళ్ళింట్లోనే దైవభక్తి చాలా హెచ్చుట. జిల్లెళ్ళమూడి అమ్మ భక్తుల్ట. వాళ్ళింట్లో పూజలూ భజనలూ హోరుగా చేస్తార్ట. మరి లాటరీలు లక్కీఛాన్సులు వాళ్ళకి గాక మనకి, ఎవరేనా కొబ్బరి చెక్కలు యిస్తే కొట్టుకి తినేవాళ్ళకి వస్తాయా? రావు రావు.

'ఇంతకీ యికుర్రాడి పేరేమిటమ్మా'

'ధనంజయండీ.'

'ఏం చదివాడు?'

'బియస్సీ.'

'ఇప్పుడేం చేస్తున్నాడు?'

'రైల్వే ఎలక్ట్రిఫికేషన్లో ఏదో అప్రెంటిస్ ఇనస్పెక్టర్ట-ఫస్ట్‌క్లాసు పాసూ అదీ వస్తుంది.'

'మంచి కెరీరే-ఎవరికైనా ఎగరేసుకుపోడానికి మంచి పెళ్ళికొడుకే మీ తమ్ముడు.'

'అబ్బ వాడికి సమ్మంధాల మీద సమ్మంధా లొచ్చేస్తున్నాయండోయ్' అంది మా కోడలు చేత్తో ఎన్నో సమ్మంధాలొస్తూన్నట్లు అభినయం చూపిస్తూ. తమ్ముడు యింటిలిజెంటయినందుకూ లక్కీఫెలో అయినందుకూ మా కోడలి మొగం మెరిసిపోతోంది.

వాళ్ళ బాబయ్యలూ పిన్నులూ కిత్తూ కిన్నూ అంతా ఈ వూళ్ళోనే గనక చూసొస్తానని

వో రెండ్రోజులు వాళ్ళ వాళ్ళింటికెళ్ళింది. అక్కడ దుర్యోధనుడి బలగంలాగ యింతమంది వున్నారు వాళ్ళ వాళ్ళు.

వెళ్ళింది తిరుగుటపాకి బిళ్ళలంటించిన కవర్లా రాత్రికి రాత్రే తిరిగొచ్చేసింద్ది. ముఖం అంతా ఏడ్చింది కాబోలు ఎర్రగా వుంది. దక్షయజ్ఞంలాటిదేదేన జరిగిందేమోనని అనుమానించా. మా ఆవిడతో చెప్పింది. ఆవిడ నాకు చెప్పింది. కట్టుకున్న వెయ్యిరూపాయల పట్టుచీర మీద వాళ్ళ పిన్నిగారి మనవరాలు ఎత్తుకోగానే పాడుచేసిందట. అది ఒక్కటే కాస్త ఎక్కడికేనా వెళ్ళినపుడు కట్టుకునేందుకు పనికివచ్చే పట్టుచీరట.

'దాని కేడవడ మెందుకు కళ్ళు వాచి పోయేలా మొగం వుబ్బిపోయేలా?'

'అందుక్కాదండి'. పర్సు ఎక్కడో పెట్టిందట. ఇలా కబుర్లు చెప్తూండగా అందులో పెట్టుకున్న ముత్యాలదండ మాయమయిపోయిందట.'

'అయ్యో పాపం! ఎంత వుంటుంది?'

'ముత్యాలు పన్నెండొందలు, చుట్టించడానికి వెయ్యిదాకా అయిందిట.'

'మరి మెళ్ళో వేసుకుంటే శుభ్రంగా వుండునుగా. పర్సులో ఎందుకు పెట్టింది?'

'దానికో లాకెట్ వుండేదిట. దాని లింకు విరిగిపోతే షాపుకెళ్ళి చేయించుకుందాం అని బాగ్‌లో పెట్టుకుంది పాపం!'

'వెతికారా?'

'వెతికారు కాని ఎక్కడని వెతుకుతారు? ఇంటి దొంగని ఈశ్వరుడైనా పట్టలేడని...'

'వాళ్ళ ఇంట్లో వాళ్ళవాళ్ళే ఎవరో తీసేసుంటారంటావ్?'

'ఖచ్చితంగా'

'మరయితే యిక్కడి కొచ్చి ఏడవడం దేనికి?

'గొలుసుపోతే ఏ ఆడపిల్లకయినా అలాగే వుంటుందండీ ఓ రెండ్రోజుల్దాకా.'

'పోయింది మందికాదు వున్నదేమంది. ఇంటి ఆడబడుచు గొలుసుపోయి కంటతడి పెడుతుంటే చూస్తూ వూరుకున్నారా?'

'ప్రశ్న లేయించాక అంజనం వేస్తే అందులో దొంగెవరో తెలిసిపోతుందన్నారు.'

'బావుంది. పదిమంది వున్నచోటుకి యిలాటి వేళ వెళ్ళేటప్పుడు మన జాగ్రత్తలో మనం వుండాలి.'

తరవాత కబుర్లు అదృష్టం లేనివాళ్ళ కబుర్లు. ఎవరెవరికి ఎప్పుడెప్పుడు పర్సులు, వుంగరాలు, కాలిపట్టాలు, వెండి గిన్నెలు, చేతిమురుగులు ఎలా పోయాయో మా ఆవిడ మొదలెట్టింది. నగలయాక చెప్పులు పోవడం, బెడ్డింగులు ఆటోల్లో మర్చిపోవడం, దండెంమీద చీరెలు, తువ్వాళ్ళు పోవడం పెన్నులు పారెయ్యడం యిలా పోవడాలు పారెయ్యడాల గురించి టాపిక్కులు ప్రవాహంలా వెళ్తున్నాయి.

'అన్‌లక్కీ ఫర్ సమ్' అని మనకన్నీ యిల్లాటివే జరుగుతాయని సరిపెట్టుకున్నా.

ఆ రాత్రి అమ్మాయి భోంచెయ్యలేదు. చిన్నపిల్ల గొలుసు పారేసుకుని అభోజ్యం పడుకుంటే మేము మటుకు ఎల్లా తినగలం కంచెడు కంచెడు అన్నాలు-అయినా ఏదో లాగించేశాం నిద్దర్లు పట్టవని.

పొద్దున్నే మా కోడలు అప్పగారొచ్చింది. పరామర్శకనుకున్నా ఆవిడ మొహంకూడా ఉదయ కమలంలా ఎర్రగా వుబ్బింది. చెల్లెల్ని కావిలించుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

'పిచ్చి పిల్లల్లారా-పోతేపోయింది. దానికోసం అల్లా మనసు పాడుచేసుకోవద్దు. ఇక ముందు కాస్త జాగ్రత్తగా వుండండి' అని హెచ్చరించా.

మా ఆవిడ 'వూరుకోండి మీకు తెలీదు' అని అసలు విషయం బైటకి లాగింది. మా కోడలు గిరిజ. ఆ అమ్మాయి అక్కపేరు వనజ. వనజ నూతిదగ్గర ముఖం సబ్బుతో తోముకుంటూ వుంగరం తీసి నూతిపళ్ళెం అంచుమీద పొందికగా పెట్టి మరిచి పోయి లోపలికెళ్ళి తువ్వాలుతో ముఖం తుడుచుకుని వచ్చి చూసేసరికి మటుమాయం-ఆ ఉంగరం పారేసిందని వాళ్ళాయనకు తెలిస్తే నానామాటలూ అంటాడ్ట. మళ్ళీ ఛస్తే ఎక్కడికీ పంపడు. ఇదీ కద!

ఆ వుంగరం ఎన్ని చిన్నాలు పట్టిందీ దానికి రాయి ఎక్కడ ఎప్పుడు ఎంతకు కొన్నదీ-ఆ వుంగరం ఎన్నిసార్లు చేయిజారి మళ్ళీ దొరికిందీ, అది వచ్చాక జరిగిన మంచీ అన్నీ వాళ్ళు ఏకరువు పెట్టుకుని చింతిస్తున్నారు.

అన్ని వస్తువుల్లోనూ దుఃఖం దాక్కొని వుంటుందని యీ పిల్లలకు తెలీదు. సుఖాలనుకున్నవాటి చివర్ల వుండేవన్నీ దుఃఖాలే కదా. దుఃఖాల్ని మర్చిపోడానికి చక్కగా గుళ్ళోకెళ్ళండని సలహా యిచ్చా. ఏ కళనున్నారో ఏమనుకున్నారో వాళ్ళిద్దరూ మా అబ్బాయీ మా అమ్మాయీ అంతా ఎంటర్ ది డ్రాగన్ సినిమా కెళ్ళారు. నవరంగ్‌లో, వస్తూ మనోరమలో భోజనాలు చేశారు తాపోపశమనార్థం. ఇప్పటి పిల్లలే వేరు. విచారంగావుంటే సినిమాకి హొటల్సుకి వెళ్తారు. మా చిన్నతనంలో వో పరీక్ష ఫేలయినా ఏదన్నా పోయినా దొరికితే మాచవరం ఆంజనేయస్వామికి కొబ్బరికాయ కొడతాం అని మొక్కుకునేవాళ్ళం. ఆంజనేయస్వామి పవరు పెరిగిపోవడం మనమిప్పుడు చూస్తున్నాం.

మా కోడలు విశాఖపట్నం కెళ్ళి పోయింది. ఒక చుట్టం వెళ్ళిపోగానే వాళ్ళతో వుండే లింకులన్నీ తెగిపోవుకానీ, సంబంధాలు ఆగిపోతాయి. ఎక్కడేనా ఏ రోడ్డుమీదేనా కనిపిస్తే వాళ్ళెలా వున్నారు వీళ్ళెలావున్నారు అని పలకరించుకోడానికి సరిపోతుంది. మా యింటికి రండి అంటూ మా యింటికి రండి అని పిలుచుకోడాలేగాని ఎవరింటికీ ఎవరూ వెళ్ళరు. ముఖ్యమైన లింకులు లేకపోతే బంధుత్వాలు నటన క్రింద మారే ప్రమాదం వుంది. మా కోడలు పుట్టింటివారంతా ఓ వీధివీధంతా వ్యాపించివున్నారు. అంతా బీరకాయ 'పీచే-

నా స్నేహితుడొకాయన ఒక మార్వాడీ కంపెనీకి తలకాయ స్థానంలో వున్నాడు. ఆయనకి బీరకాయలంటే యిష్టం. ఎక్కడేనా కూచుని కాస్త బీరు చప్పరిస్తున్నప్పుడు, ఏదేనా కాలు నొప్పో కడుపునొప్పో రోగ ప్రస్తావన వస్తే దానికి ఠక్కున హోమియోపతి మందు చెప్తాడు. అక్కడే ఆ బారులోని చీటీమీదే మందుపేరు రాసి తెప్పించి వాడికి ఎలాగుందో తనకు మళ్ళీ ఫోన్ చేసి చెప్పమంటాడు. వాళ్ళాఫీసులో అంతా అరవవాళ్ళే-వాళ్ళకాయనమీద గుర్రు. ఈయనకి ఓ బాబాగారున్నారు వెనక. ఆయనకు పూజలు యింట్లో భజనలు, వాళ్ళిల్లు ఆధ్యాత్మిక హడావిడితో మరో ప్రపంచంలా వుంటుంది. ఆయనకు ముగ్గురూ ఆడపిల్లలే-తెల్లగా ఎర్రతాళ్ళలా వుంటారు. అందులో పెద్ద పిల్లకు వో సంబంధం కుదిరిందని నా స్నేహితుడు చాలా ఆనందంగా చెప్పాడు. కూతురికి సమ్మంధం కుదిరితే ఏ తండ్రికి గాల్లో తేలిపోతున్నట్లు వుండదు? బెర్నార్డ్‌షా చెప్పినట్లు తండ్రి అందమూ తల్లి తెలివితేటలూ వచ్చాయి. వాళ్ళ కనిపిస్తుంది చూసేవాళ్ళకి. మా స్నేహితుడుగారు చికాగ్గా వున్నపుడు ఆఫీసులో అరవ అధికారులు పితలాటకాలు పెట్టినప్పుడు ఒకటి రెండు బీరకాయలుపట్టిస్తే ఏవిగాని, ఆయన శుభ్రమైన ఇంగ్లీషు రాస్తాడు. పైగా హనుమదో పాసకుడు. హనుమంతుడి దయ వుండాలి గాని పిల్లలకు పెళ్ళిళ్ళు ఎందుకు కావు? నా స్నేహితుడి పేరు స్వామి అంటారు. స్వామి పుత్రికా వివాహజనితోత్సాహ పరవశుడై బీరు సేవిస్తూ-తనకాబోయే అల్లుడు పెళ్ళికూతురి కోసం అప్పుడే కొంత బంగారం జాగర్త చేసి యిల్లా కాపరానికి రావడమేనట అలా కోరిన నగలు చేయించడానికి సిద్ధంగా వున్నాడని మావగారు స్వామిని విశేషంగా ఆనందిస్తూ చెప్పాడు.

'అల్లాటి జాగర్తపరుడు ప్రయోజకుడు అయిన అల్లుడు దొరకడం అంతా హనుమంతుడి దయే' నని నేనూ వప్పుగుంటా-

'ఎవరోయ్ ఆ పిల్లోడు?' అని అడిగా.

ఫలానా ఫలానా వీధిలో వుంటాడు. ఫలానావాళ్ళు. అన్నీ చెప్పాడు. పేరు అడిగా. 'ధనుంజయ' అని చెప్పాడు.

'అబ్బ-ఆ కుర్రాడా ఆ కుర్రాడు చాలా లక్కీఫెలో-అల్లుడు అడుగుపెట్టిన వేళావిశేషం. నీకు ప్రమోషను కన్‌ఫర్మేషనూ ఖాయం. నీ విరోధులకు ట్రాన్స్‌ఫర్, యింక్రిమెంట్లు బందయిపోతాయి, అని ఆశీర్వదించాను.

కొన్నాళ్ళకి పెళ్ళయింది. వధూవరుల్ని ఆశీర్వదించడానికి 'మేమంతా వెళ్ళాం. తెల్లారగట్ల ముహూర్తం. రాత్రి భోజనాలయాక పెళ్ళయేదాకా పేకాట వేశారు మగపెళ్ళివారు. కందిపొడుం, ఆవకాయ కూడా వడ్డించారు. మిగతా అన్నిటితో. పెరుగు మాంచి చిక్కగా వుంది. ఇలా పెళ్ళయిందో లేదో మగపెళ్ళివారి చుట్టాలు విడిదిలో

కెళ్ళి పక్కతీసేశారు. తెల్లారేక ప్రతి వాళ్ళవీ ఏదో ఒక ఖరీదైన వస్తువు పోయింది. రిస్టువాచీలు, జేబుల్లో నోట్లు, వుంగరాలు-చిన్న చిన్న ట్రాన్సిస్టర్లు మాయమయ్యాయి.

మా స్వామికి అభిమానం ఎక్కువ. అతనికి గుర్రప్పందాల్లో వేలకివేలు వస్తూ పోతూ వుంటాయి. అశ్వాగ్నం బాగా తెలిసినవాడు. ఆ పోయిన వస్తువులు తనిస్తానన్నాడు. 'అరె' ఆడపిల్ల పెళ్ళిచేసి అలిసిపోయి వున్నారు. మీకెందుకీ దండగ, అని వద్దువద్దన్నారు. పెళ్ళిళ్ళలో చేవాటుతనం వున్నవాళ్ళుంటారు. కాస్త జాగ్రత్తగా వుండాల్సింది అనుకున్నారు.

మా కోడలు ధనుంజయ పెళ్ళికి వచ్చింది గాని మునుపటంతగా పూసుకుతిరగలేదు. అక్కగారని వరసకు చీరా రవికా పెట్టారు. ఆడబడుచు మర్యాదలు కొన్ని చేశారు. ఈ అమ్మాయి చాలా అల్ప సంతోషి. కాని ముభావంగా దిగులుగా వుంది. సత్యనారాయణ వ్రతానికి రమ్మన్నారు. వెళ్ళివచ్చింది. కాని ఎందుకో కళ్ళు వుబ్బి వున్నాయి. మళ్ళీ ఏమొచ్చింది అనుకున్నా. తల్లి లేదు. అక్కడకు వెళ్ళింది కదా తల్లి గుర్తుకొచ్చి బాధ పడుతుందేమో అనుకున్నా.

సత్యనారాయణ వ్రతానికి నన్ను కూడా రమ్మన్నారు. నేను నవ్వేసి వూరుకున్నా. వెళ్ళలేదు. ఆడవాళ్ళ వెనక తోకలా వెళ్ళడం నా కిష్టంలేదు. అసలు వాళ్ళ కబుర్లు వాళ్ళ ప్రపంచం అంటే నాకు పడదు. ఏదన్నా పుస్తకం పుచ్చుకుని ఓ మూల కూర్చుని చదువు కోవడం నా కిష్టం.

సంజయ రాయబారంలా మా ఆవిడ వచ్చి ఆ మాటలు యీ మాటలు చెవిన వేసి తను వెళ్ళిపోతూ వుంటుంది.

మా కోడలి మేనత్తగా రొకావిడ వుందిట. ఆవిడ దగ్గరో పాతిక ముప్పై కాసుల బంగారం వుందిట పెట్లో. దాన్ని ఏ పెట్టెలోనో దాచుకోకపోతే బ్యాంకుల్లో దాచుకోకూడదా అని అంటే ఆవిడేం మాట్లాడేది కాదట. ఆవిడకి సంతానం లేదు. మొగుడుపోయి చాలా కాలం అయింది. పుట్టింటికొచ్చేసింది. అందరూ తమ్ముళ్ళే చివరికి ఎవరింట్లోనూ వుండనీయరు మరదళ్ళు. తమ్ముళ్ళకు మరదళ్ళ కొంగు బంగారాలు. అనగా తెల్లగా మెరవడం మర్చిపోయిన పాత పెయింటింగ్ లోంచి నడచి వస్తున్న మనిషిలా వుంటుంది. అవన్నీ ఒకప్పుడు తను మసలిన చోట్లే-ఆ స్తంభాల్ని పట్టుకుని చిన్నప్పుడు తిరుగుతూ ఆడుకున్నారు. పుట్టింటి గురుతులు ఎలా మాసిపోతాయి? అమ్మమ్మడివుసావిట్లో ఓ మూల వండుకు తిని పడుకునేది. అభం శుభం ఎరుగని పిల్లలు ఆవిడతో ఆడుకునేవారు. ఆ యిల్లు ఆవిడ వదల్లేదు. అది స్వర్గపాతాళాలకి లంకెలా వుండేది. స్వయాన మేనత్తయినా ఆవిడను ఎవరింట్లోనూ పడుకోనిచ్చేవారు కాదు. కీడెంచి మేలెంచమని ఒకవేళ పోతే ఆ తరువాత వన్నీ తలకు చుట్టుకుంటాయి- ఆవిడ దగ్గర బంగారం వుంది. అది ఎవరికిస్తే వాళ్ళే కళ్ళకద్దుకుని చేస్తారు అని లోకం అంటుంది. ఈ ప్రపంచంలో ముసలి మేనత్తలు

పెద్దవాళ్ళు వాళ్ళని ఆదరించి అభిమానించి ఒక పూట విస్తరేసి అన్నంపెట్టేవాళ్ళు కరువయ్యాక యిక లోకం గురించి వాళ్ళకెటువంటి కోపం వుంటుంది? చేతగాని కోపం పెట్టుకుని ఏం ప్రయోజనం?

మా ఆవిడవడలు నొక్కుకుంటూ చెప్పింది. ఆ విషయం అయ్యో అన్నారు గాని ఎవరూ పట్టించుకోలేదట. ఎవరికో యిచ్చి దొంగ నాటకం ఆడుతోందని అన్నారట కూడా. ముసలమ్మగారి పెట్లో బట్టలమడతల్లో దాచుకున్న పాతిక ముప్పై కాసుల నగలు మొత్తం పోయాయట. ఎవరో పెట్టె మారుతాళం చెవితో తీసి బంగారం కాజేశారు. ఆవిడ పాపం పెట్టెముందు కూచుని రోజుల్లా తిండీ తిప్పలు లేకుండా ఏడుస్తూనే వుంది. పసుపు ఎప్పుడో పోయింది. 'బంగారం యిప్పుడు పోయింది' అని గోల పెట్టిందట.

మా కోడలు మేనత్తని తనతో రమ్మని తన దగ్గరుండమని తను చూస్తానని బతిమాలిందట.

ఈ అమ్మాయి యిప్పుడు కళ్లనీళ్ళు పెట్టుకున్నది. మేనత్త మంచితనం గురించి కాని ఆవిడకు పోయిన బంగారం గురించి కాదు. ఏడవడం దేనికి? లోకం యిలా వుందని ఏడవాలా? మనుషుల్ని మనుషులే పంచిస్తున్నారని బాధపడాలా? ఎవరికీ ఏమీ తేలీనట్లుంటాడు. అందరికీ అన్నీ తెలుసు.

ఇంట్లో శుభకార్యం జరిగిన చోట యీ ఏడుపులూ మూలుగులూ ఏవిటే అని వినుకున్నార్ట- పెళ్ళికూతురే పెళ్ళికొడుకుని గదిలోకి లాక్కుపోయేలా వుందని పేరంటాళ్లు నవ్వుకున్నారు.

చిల్లరదొంగతనాలు చిన్నచిన్న అపశ్రుతులకేవిగాని పెళ్ళి మా బాగా జరిగింది. బూరెలు లడ్లు అరిసెలూ అటుకులూ పంచదారంతా-పెళ్ళి సరదాగా జరిగినట్లే.

మా స్వామిగారు మళ్ళీ బీరు కాయలు పట్టిస్తూ అర్థనిమీలిత నేత్రాలతో 'మా అల్లుడు గజం మూడొందలు పెట్టి బెంజి కంపెనీ దగ్గర రెండు ప్లాట్లు కొన్నాడు తెలుసా- ఒకటి మా అమ్మాయి పేర, ఒకటి తన పేర' అన్నాడు.

నేనేం మాట్లాడలా-

వాష్ బేసిన్ దగ్గరకెళ్ళి పుక్కిలించి వుమ్మేసి మొహం కడుకున్నాను.